ప్రజాశక్తి
బుధవారం 9 నవంబర్ 2022



నెలాఖరుకు కొత్తవలస కాటేజీల నిర్మాణం


సూచనలు చేస్తున్న ఐటిడిఎ పిఒ గోపాలకృష్ణ

ప్రజాశక్తి -అరకులోయ రూరల్ : మండలంలోని కొత్తవలస ఫారంలో నిర్మిస్తున్న కాటేజీలు నిర్మాణాలను నెలాఖరుకు పూర్తి చేయాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి ఆర్.గోపాలకృష్ణ అదేశించారు. మంగళవారం కాటేజీల నిర్మాణ పనులను పరిశీలించారు. ఔషధ మొక్కలు పార్కు పనులు వచ్చే నెలాఖరుకు పూర్తి చేసి, పర్యాటకులకు అందుబాటులోకి తేవాలన్నారు. మడగడ వ్యూపాయింట్‌ను పరిశీలించారు. భౌగోళిక స్వరూపం మారకుండా పర్యాటకులకు ఆహ్లాదం కలిగించే విధంగా వ్యూపాయింట్ అభివృద్ధి చేయాలని అదేశించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ విభాగం ఇఇ కె.వేణుగోపాల్, మ్యూజియం మేనేజర్, మురళి పాల్గొన్నారు.

గిరిజన ప్రాంత సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యం

- మండలాల మారుమూల గ్రామాలకు రహదారులు నిర్మించాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం


మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, చిత్రంలో జిల్లా కార్యదర్శి కిరణ్ తదితరులు

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీ ప్రాంత సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం అన్నారు. మంగళవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో 6 మండలాల ముఖ్య కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు మట్ల వాణిశ్రీ అధ్యక్షతన జరిగింది. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీతారాం మాట్లాడుతూ రంపచోడవరం ఏజెన్సీ 11 మండలాల్లో గిరిజనులు రహదారులు, తాగునీరు, సాగునీరు, విద్య, వైద్యం, విద్యుత్, ఇతర సమస్యలతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనుల పంటలకు గిట్టుబాటు ధర లేదని, ప్రధానంగా జీడిమామిడి, జాబ్రా పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజనులు పండించిన, సేకరించిన అటవీ ఉత్పత్తులను ఐటిడిఎ, జిసిసి ద్వారా కొనుగోలు చేసి గిరిజనులను దళారుల బారినుండి కాపాడాలన్నారు. ప్రభుత్వం సచివాలయాల నిర్మాణాల పేరుతో కోట్లాది రూపాయలు ఖర్చు చేసి, గిరిజన గ్రామాల్లో ఎటువంటి కనీస మౌలిక సదుపాయాలు లేకుండా చేస్తుందని విమర్శించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనీస సౌకర్యాలు, వైద్యులు, మందులు అందుబాటులో ఉంచాలని, ఓపికి తగినట్లు బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ కాలేజీలు, ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో ఎఎన్ఎంలను నియమించాలన్నారు. ఇక్కడ నుంచి గెలిసిన అధికార పార్టీ ఎమ్మెల్యే ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. పోలవరం నిర్వాసితులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిరిజనులు, ఏజెన్సీ ప్రాంత సమస్యలను పట్టించుకోకపోతే సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజలను కదిలించి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, నాయకులు కె.శాంతిరాజు, బాపన్నదొర, శ్రీను, సిరిమల్లిరెడ్డి, పాపారావు, రాజన్నదొర, రఘుపతి, బులియమ్మ, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన యువతను ప్రోత్సహిస్తే క్రీడల్లో రాణింపు

ఆర్చరీ శిక్షణ విద్యార్థులకు క్రీడాపరికరాలు ఇవ్వాలి
గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర


శిక్షణ పొందుతున్న క్రీడాకారులను అభినందిస్తున్న సురేంద్ర

ప్రజాశక్తి -అరకులోయ రూరల్ : అరకులోయ స్పోర్ట్స్ స్కూల్‌లో శిక్షణ పొందుతున్న గిరిజన ఆర్చరీ విద్యార్థులకు ప్రభుత్వపరంగా ఉచితంగా క్రీడాపరికాలను అందజేయాలని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లోసురేంద్ర కోరారు. గిరిజన యువతను క్రీడల్లో ప్రోత్సాహిస్తే, వారి విశేషంగా రాణించి, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పతకాలను సాధించే సత్తా వారిలో ఉందన్నారు. మంగళవారం అరకులోయ స్పోర్ట్స్ స్కూల్‌ను సందర్శించారు.వచ్చే నెలలో గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో జరిగే జాతీయస్థాయి ఆర్చరీ ఛాంపియన్ షిప్‌లో పాల్గొనేందుకు శిక్షణ పొందుతున్న రాష్ట్రవ్యాప్తంగా వివిధ ఏకలవ్య పాఠశాలలకు చెందిన 30మంది గిరిజన విద్యార్థినీ, విద్యార్థులను కలుసుకుని వారితో మాట్లాడారు. స్పోర్ట్స్‌స్కూల్‌లో శిక్షణ పొందుతున్న విధానంపై వారిని అడిగి తెలుసుకున్నారు. జాతీయపోటీల్లో బాగా రాణించి పతకాలను సాధించాలని ఆకాంక్షిస్తూ, వారందరికీ అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ, విలువిద్యలో శిక్షణ పొందుతున్న గిరిజన విద్యార్థులకు సంబంధిత క్రీడాకిట్లు కొనాలంటే సుమారు రూ.ఎనిమిది వేలు ఖర్చు అవుతోందని, అంతమొత్తం ఖర్చుపెట్టే స్థోమత వారికి లేదన్నారు. ఈ నేపథ్యంలో వారిక అవసరమైన క్రీడా సామగ్రిని ఐటిడిఎ ద్వారా ఉచితంగా అందజేయాలన్నారు. ఆర్చరీ క్రీడాకారులతోపాటు ఇతర క్రీడల్లో శిక్షణ పొందే గిరిజన విద్యార్థులకు క్రీడాప రికరాలు బూట్లు, యూనిఫాం, ఉచితంగా అందించాలని కోరారు. గిరిజన యువతకు అవసరమైన సౌకర్యాలను కల్పించి, క్రీడల్లో నైపుణ్యాన్ని పెంచేలా శిక్షణనిస్తే, జాతీయ, అంతర్జాతీయస్థాయిలో పతకాలను సాధించే సత్తా వారిలో ఉందన్నారు. అరకులోయ స్పోర్ట్స్ కాలేజీని అప్‌గ్రేడ్ చేసి కాలేజీ విద్యార్థులకు కూడా శిక్షణనిచ్చే చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో పిఇడిలు సింహాచలం నాయుడు, సూరిబాబు, గిరిజన సంఘం మండల కార్యదర్శి పి.రామన్న, ఎస్ఎఫ్ఐ గర్ల్స్ కన్వీనర్ ఎస్. గంగ, ఎస్ఎఫ్ఐ నాయకులు కె.ధనలక్ష్మి, బుల్లెమ్మ కె.కృష్ణ పాల్గొన్నారు.

నేడు పాపికొండల విహారయాత్ర పున:ప్రారంభం

ప్రజాశక్తి-విఆర్.పురం

వరదల కారణంగా నిలిచిపోయిన పాపికొండల విహారయాత్ర పోచవరం బోటు పాయింట్ నుంచి బుధవారం అధికారులు పున:ప్రారంభించనున్నారు. పర్యాటకులు విఆర్.పురం మండలం మారుమూల కొండరెడ్లు, పోచవరం గ్రామం వద్ద ఏర్పాటు చేసిన విహారయాత్ర బోటు పాయింట్‌ను ఆశ్రయించి అక్కడి నుండి పాపికొండలకు వెళ్లాలని నిర్వాహకులు సూచించారు. గత రెండు రోజులుగా అధికారులు బోటు యాజమాన్యం ప్రభుత్వం ఆదేశాల మేరకు పోచవరం నుండి పాపికొండలకు ట్రయల్ రన్ నిర్వహించారు. బుధవారం నుండి విహారయాత్ర కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.


పూజలు నిర్వహిస్తున్న లాంచీల యజమానులు

నిర్మాణాల్లో నాణ్యత లోపిస్తే చర్యలు

రంపచోడవరం ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే


అధికారులకు సూచనలు చేస్తున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి-మారేడుమిల్లి

నిర్మాణాల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని రంపచోడవరం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే హెచ్చరించారు. మంగళవారం ఆయన స్థానిక ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఇక్కడ జరుగుతున్న అతిథి అధ్యాపకుల డెమో క్లాసులను పరిశీలించారు. సంబంధిత ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యార్థుల ఆరోగ్యంపై అశ్రద్ధ చేయవద్దని సూచించారు. మెనూ అమలు చేయడంలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠశాలలో జరుగుతున్న నిర్మాణ పనులపై ఆరా తీశారు. అనంతరం మారేడుమిల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణానికి సంబంధించి స్థలాన్ని పరిశీలించారు. ఈ నిర్మాణ పనులను పర్యవేక్షించాలని స్థానిక ఎంపీడీవో వీర కిషోర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఏఈ వెంకటరమణ, డిప్యూటీ తహశీల్దారు రాజు ఏకలవ్య పాఠశాల, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

11న ఇళ్ల అభ్యంతరాలపై గ్రామసభలు

ప్రజాశక్తి -విఆర్.పురం

పోలవరం ఇళ్ల ప్యాకేజీకి సంబంధించి ఇటీవల ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో ఇళ్ళ నష్టపరిహారం ఇచ్చే నిమిత్తం పిఎన్ నోటిఫికేషన్‌లో అభ్యంతరాలపై ఈ నెల 11న గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దారు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు రాజుపేటలోనూ, మధ్యాహ్నం ఒంటిగంట నుండి సాయంత్రం 5 గంటల వరకు వడిగూడెం రాజుపేటలోనూ ఈ గ్రామ సభలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆయా గ్రామాల పీడీఎఫ్ కుటుంబ యజమానులు, ప్రజాప్రతినిధులు విధిగా హాజరు కావాలని కోరారు.

గణితం, సైన్స్ టీచర్లను నియమించాలి


విద్యార్థినులతో మాట్లాడుతున్న జెడ్‌పిటిసి మత్స్యలింగం

1ప్రజాశక్తి -హుకుంపేట : స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఖాళీగా ఉన్న గణితం, ఫిజికల్ సైన్స్ టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని జెడ్‌పిటిసి రేగం మత్స్యలింగం కోరారు. మంగళవారం పాఠశాలను సందర్శించారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు సబ్జెక్టుల టీచర్లు, అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, ఇతన సమస్యలను విద్యార్థులు వివరించారు.

ఈ సందర్భంగా మత్స్యలింగం మాట్లాడుతూ, పాఠశాలలో 440 మంది విద్యార్థులు ఉన్నారని, వారంతా ఇంగ్లీష్ మీడియంలో చదువుతున్న నేపథ్యంలో ప్రధానమైన గణితం, పిఎస్ సబ్జెక్టులకు టీచర్లు లేకుంటే వారికి సరైన, నాణ్యమైన విద్య ఎలా అందుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మరుగుదొడ్లు, తరగతి గదులు, ఇతర మౌలిక సౌకర్యాల కొరతపై జిల్లా కలెక్టర్ ఇతర అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం, ఐటిడిఎ, గిరిజన సంక్షేమ యంత్రాంగం నిర్లక్ష్యం వహించడమంటే, వారి భవిష్యత్‌తో ఆడుకోవడమేనని, వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లంబన్న ఉన్నారు


ఆర్‌ఒఎఫ్ఆర్ పట్టాలు చూపుతున్న గిరిజనులు

ఆర్‌ఒఎఫ్ఆర్ పట్టాల పంపిణీ

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని బూదరాళ్ళ పంచాయతీ పరిధి నల్లబెల్లి గ్రామంలో గిరిజనులకు ఆర్‌ఒఎఫ్ఆర్ పట్టాలను ఎంపిపి బడుగు రమేష్, జెడ్‌పిటిసి వారా నూకరాజు, వైసిపి మండల అధ్యక్షులు జల్లి బాబులు, వైస్ ఎంపిపి వెంకట రమణ మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 126 పట్టాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సాగిన సంజీవ్, ఎంపిటిసి వంతల కుమారి, ముసిలి నాయుడు, రాజు, తిరుపతి, రమణ, లక్ష్మణ్, లక్ష్మి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో మేలు

- రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

ప్రజాశక్తి-మారేడుమిల్లి

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు ఉపయోగించుకోవాలని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని పాములేరు పంచాయితీ పరిధిలోని ఎల్లివాడ, కాకురూ, కొత్తవీధి, పాములేరు, కుర్రవాడ గ్రామాల్లో మంగళవారం ఆమె గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఇంటింటి వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు అమలు తీరు అడిగి తెలుసుకున్నారు. ఎల్లివాడ, కాకూరు గ్రామానికి రహదారి నిర్మించి, తాగునీటి సదుపాయం కల్పించాలని, కాకురు నుంచి కొత్తవీధికి మార్గమధ్యలో పాములేరు వాగుపై రోప్ బ్రిడ్జి నిర్మించాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సార్ల అతిత కుమారి, జెట్పీటీసీ సభ్యుడు గొర్లె బాలాజీ బాబు, వైస్ ఎంపీపీ లక్కోండ రవికుమార్, కో-ఆప్షన్ సభ్యుడు గురుకు దర్మరాజు, మారేడుమిల్లి సర్పంచ్ కొండ జాకబ్, పార్టీ మండల కన్వీనర్ సత్తి సత్యనారాయణ రెడ్డి, కార్యదర్శి గంగరాజు, యూత్ అధ్యక్షుడు గొర్లె బాలీ, నాయకులు సార్ల లింగారెడ్డి దూడ స్మిత్, సత్తి సునీల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వ పథకాల కరపత్రాన్ని మహిళకు ఇస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

విస్తృతంగా 'ఫ్యామిలీ ఫిజీషియన్' వైద్యసేవలు

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి -హుకుంపేట: ఫ్యామిలీ ఫిజిషియన్ ద్వారా అన్ని గిరిజన గ్రామాల్లో ప్రతిఒక్కరికీ మెరుగైన సేవలను విస్తృతంగా అందించాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం మండలంలోని తీగలవలస పంచాయతీలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్యశిబిరం,104 వాహన సేవలను ఆకస్మిక తనిఖీ చేసారు. ఈ సందర్భంగా మాట్లాడతూ, ఫ్యామిలీ ఫిజిషియన్, 104 వైద్యసేవలపై గిరిజనులందరికీ అవగాహన కల్పించాలన్నారు హైపర్ టెన్షన్ నివారణకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని సూచించారు. గర్భిణులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించడంతోపాటు ఆసుపత్రి డెలివరీల ద్వారా మాతాశిశుసంరక్షణపై వారిని చైతన్యపరచాలని ఆదేశించారు. 104 వాహనంలో గర్భిణులకు వైద్యసేవలు అనంతరం, ఆయా గ్రామాల్లోని హాస్టల్స్, అంగన్వాడీలు, పాఠశాలలను సందర్శించి వైద్యసేవలు అందించాలని సూచించారు.

అనంతరం తీగలవలస అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రంలోని సరుకుల నిల్వలను పరిశీలించారు. నిల్వల వివరాలను రికార్డుల్లో సక్రమ ంగా నమోదు చేయాలని ఆదేశించారు. అంగన్వాడీలకు రాలేని లబ్ధిదారుల ఇంటికే వెళ్లి పోషకాహారం అందించాలని సూచించారు. ఓలుబెడ్డలో ఆశావర్కర్‌ను నియమించాలని స్థానికులు కోరగా, జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.

పిహెచ్‌సి నిర్వహణపై అసంతృప్తి

ఆతరువాత హుకుంపేట పిహెచ్‌సిని తనిఖీ చేసారు. ల్యాబొరేటరీ, వార్డులను, వెయిటింగ్ హాల్‌ను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేసారు. అందుబాటులో ఉన్న ఆసుపత్రి అభివృద్ధి నిధులు రూ.1.50లక్షలతో బర్త్ వెయిటింగ్ హాల్ లీకేజీలకు మరమ్మతులు చేపట్టాలని, ఆసుపత్రికి అవసరమైన మందులు బెడ్‌షీట్లు, వైద్యపరికరాలను కొనుగోలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ రాజ్యలక్ష్మి , సిడిపిఒ మణిదేవి ఇతర అధికారులు పాల్గొన్నారు.

'గడప గడపకూ'తో సమస్యల పరిష్కారం

అరకు ఎమ్మెల్యే శెట్టి ఫాల్గుణ

ప్రజాశక్తి- పెదబయలు : గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమంలో పలు ప్రజాసమస్యలను పరిష్కరించి, సౌకర్యాల కల్పనకు చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే శెట్టి ఫాల్గుణ అన్నారు. మంగళవారం లక్ష్మిపేట పంచాయతీ కీలుములు, బల్లపురాయి గ్రామాల్లో గడపగడపకూ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆయా గ్రామాల్లో డ్రైనేజీలు, తాగునీటికి గ్రావిటీ పథకాలకు నిధులు మంజూరు చేశామన్నారు. శిథిలమైన అంగన్వాడీ భవనం పునర్నిర్మాణానికి రూ.20లక్షలతో ఆంచనా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. సల్దిమామిడిలో వందమీటర్ల సిసిరోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. రూ.90 లక్షలతో కొత్తూరు జంక్షన్ నుండి లక్ష్మిపేట వరకు, అలాగే సీకరి నుంచి కూడాసింగి వరకు రూ.2.50కోట్లతో ఐదు కిలోమీటర్ల బిటి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభం అవుతాయాన్నారు


కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

వైసిపిలో 79కుటుంబాలు చేరిక

ఈ సందర్భంగా కీలుములు, బల్లపురాయి గ్రామాలకు చెందిన పంచాయతీ ఉపాధ్యక్షుడు కొరవంజి బొంజుబాబు, సిదే రామారావు ఆధ్వర్యంలో టిడిపి చెందిన 79కుటుంబాలు వైసిపిలో చేరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్రకార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ, ఆగ్రో డైరెక్టర్ వనాల్బ సన్యాని, సర్పంచ్‌ల ఫోరమ్ మండల అధ్యక్షులు ఖాతారీ సురేష్, మాజీ అధ్యక్షులు పాంగి సింహాచలం, పార్టీ మండల అధ్యక్షులు వి ఆనందరావు, వైసిపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు

స్వచ్ఛందంగా గంజాయి మొక్కల నరికివేత

ప్రజాశక్తి -జి మాడుగుల : మండలంలోని జి.మాడుగుల పంచాయతీ కరకపుట్టు, కొత్తవీధి గ్రామాలలోని గిరిజనులు తాము సాగుచేసిన గంజాయి మొక్కలను మంగళవారం స్వచ్ఛందంగా నరికేశారు. ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు ఆయా గ్రామాల్లో పర్యటించి, గంజాయి సాగు, అక్రమ రవాణా వల్ల కలిగే అనర్థాలు, ప్రభుత్వపరంగా చేపట్టే కఠినశిక్షలపై గిరిజనులకు అవగాహన కల్పించారు. గంజాయి సాగుచేసినా, రవాణా చేసినా కేసులు నమోదు చేసి జైలుకు పంపక తప్పదని హెచ్చరించారు. దీంతో చైతన్య వంతులైన గిరిజనులు తాము పండించిన గంజాయి మొక్కలను వారే స్వయంగా నరికేశారు.ఈ సందర్భంగా తాము ఇక ముందెన్నడూ గంజాయి సాగు, రవాణాలో భాగస్వాములు కాబోమని ప్రతిజ్ఞ చేశారు. గ్రామంలో అసాంఘిక కార్యకలాపాలకు ఆస్కారం లేకుండా చూస్తామని పోలీసులకు హామీనిచ్చారు.


గంజాయి మొక్కలను నరికేస్తున్న గిరిజనులు

రుణయాప్‌ల మోసాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సంతోష్‌కుమార్

ప్రజాశక్తి- డుంబ్రిగూడ: రుణయాప్‌లు, గంజాయి మాఫియా ఉచ్చులో పడి గిరిజనులు, ముఖ్యంగా యువత జీవితాలను అంధకారం చేసుకోవద్దని ఎస్ఐ సంతోష్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని లైగెండ పంచాయతీ లైగండ, జాకరవలస, పనసపుట్టు తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, రుణాలు తీసుకునేంత వరకు ఆన్‌లైన్‌లో మెసేజ్‌లు, చాటింగ్‌లతో ఒత్తిడి చేసిన ప్రైవేటు రుణయాప్‌ల ఉచ్చులో పడి అనేక మంది ఇబ్బందులకు గురౌతున్నారన్నారు. తీసుకున్న రుణం రికవరీకి వాళ్లు చేసే ఒత్తిడిని తట్టుకోలేక అనేకమంది ఆత్మహత్యలు చేసుకున్న ఉదంతాలను వివరించారు. అలాగే గంజాయి మాఫీ ప్రలోభాలకు లొంగి, అక్రమ రవాణాలో పాలుపంచుకోవడం ద్వారా జైలు ఊచలను లెక్కించే పరిస్థితులను తెచ్చుకోవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మత్తుతో యువత భవిష్యత్తు చిత్తు

ప్రజాశక్తి-డుంబ్రిగూడ:గంజాయి, నాటుసారా, మద్యం వంటి మత్తు పదార్థాలకు గిరిజన యువత అలవాటు పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని మానవ హక్కుల నేర నిరోధక సంఘం, అల్లూరి జిల్లా అధ్యక్షుడు పి ధర్మ కోరారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మైదాన ప్రాంతానికి చెందిన కొంతమంది గంజాయి వ్యాపారులు గిరి యువతకు డబ్బులను ఆశ చూపి, గంజాయి అక్రమ రవాణాకు ప్రోత్సాహించడం బాధాకరమన్నారు. ఇటువంటి సందర్భంలోనే పోలీసులకు పట్టుబడి, జైలు పాలౌతున్నారని, కుటుంబాలకు కాకుండా పోయి, భవిష్యత్‌ను పాడుచేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా ఇంటర్మీడియట్, డిగ్రీ గిరి యువత యువత గంజాయి సిగరెట్లకు, మద్యానికి అలవాటు పడి, మధ్యలో చదువు మానేసి భవిష్యత్తును అంధకారం చేసుకుంటున్నారన్నారు. దీనిపై గిరిజన ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాలు కలిసి యువత చెడు మార్గాలకు వెళ్లకుండా అవగాహన కల్పించాలనికోరారు.



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ ప్రేమ

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో మెరుగైన వైద్యం

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: ఫ్యామిలీ ఫిజీషియన్ పథకం ద్వారా ప్రజల వద్దకే మెరుగైన వైద్యసేవలు అందించనున్నామని డుంబ్రిగుడ పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ప్రేమ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పోతంగి సచివాలయంలో డాక్టర్ ప్రేమ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యసిబ్బంది గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో హెచ్‌వి మంజుల, హెల్త్ అసిస్టెంట్ ఎస్ స్వామి, ఆశ కార్యకర్త ఎం మేరీ, వైద్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

ప్రజాశక్తి-సీతమ్మధార : నటరత్న కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యాన మంగళవారం విశాఖ పౌర గ్రంథాలయంలో నందమూరి చిత్ర గీతాలతో సినీ సంగీత విభావరి నిర్వహించారు. భయ్యా శ్రీనివాస్, రమణి పాడిన కనులేవేక లిలిపిగ, మహ్మద్ ఖాన్, గీత పాడిన అందాల ఆడ బొమ్మా రాము, సాత్విక పాడిన చోర నమ్మ పందురాగ, పోతురాజు శ్రీనివాసరావు, సివి రాజేశ్వరి కలిసి పాడిన సన్న జాజులోయ్, లోకేష్, శైలజ పాడిన చిలక పచ్చకోక, సుధీర్, శైలజ పాడిన చిలక కొట్టుడు కొడితే, భయ్యా, రమణమ్మ పాడిన చిత్రం భళారే విచిత్రం, శ్రీనివాస్, జ్యోత్స్న పాడిన ఊరు సురు ఫీర వంటి పాటలు ప్రేక్షకులను రంజింప జేశాయి. కే బోర్డుతో లోకేష్, తబలాతో శివ, ఫాడ్స్‌తో అప్పలరాజు, కాంగోతో బాబ్జి వాయిద్య సహకారం అందించారు. ఎస్ పణిస్వామి, కళా సంస్థల కార్యదర్శి చెన్నా తిరుమలరావు ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో సూర్యప్రభ, జెఎంఆర్ నెహ్రూ, వెంకటేష్, కెవి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ద్వారం వెంకట స్వామికి నీరాజనం

ప్రజాశక్తి-సిరిపురం : వయోలిన్ వాయిద్యంలో శాస్త్రీయ సంగీతానికి ద్వారం వెంకటస్వామినాయుడు వన్నె తెచ్చారని మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ అన్నారు. ద్వారం 129వ జయంతి సందర్భంగా మంగళవారం ఆర్‌కె.బీచ్ రోడ్డులోని ఆయన విగ్రహానికి పుంపాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూల మాలలు వేసి నీరాజనాలు పలికారు. ఈ సందర్భంగా దాడి సత్యనారాయణ మాట్లాడుతూ, కర్ణాటక సంగీతాన్ని సొంతగొంతుపై వినిపించవచ్చని నిరూపించిన ప్రథమ వ్యక్తి ద్వారం అని కొనియాడారు. శంభారావు అధ్యక్షుడు బొమ్మిడి సత్యనారాయణ మాట్లాడుతూ, దేశం గర్వించదగ్గ గాయకుడు ఘంటసాల సంగీతాన్ని ఉచితంగా నేర్పించిన మహనీయుడు అని తెలిపారు. సప్తస్వర భారతి జాతీయ సమన్వయ కర్త పి.కన్నయ్య, ప్రజా గ్రంథాలయాల అభివృద్ధి సంస్థ అధ్యక్షుడు పిఎస్ఎన్.మూర్తి మాట్లాడుతూ వయోలిన్, తంబూరా, వీణ తదితర సంగీత పరికరాల శిక్షణ కోసం వ్యాసాలు రాయడంలో గొప్ప గుర్తింపు పొందారన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నా తిరుమలరావు, సంగీత సంస్థల ప్రతినిధులు, కళాకారులు పాల్గొన్నారు.

10న వికలాంగుల బస్సు పాస్ క్యాంపు

ప్రజాశక్తి -ములగాడ : ఆర్‌టిసి సౌజన్యంతో వికలాంగులకు ఉచిత బస్ పాసుల నిమిత్తం ఈ నెల 10న తేదీన క్యాంపు నిర్వహిస్తున్నట్లు శ్రీ విఘ్నేశ్వర వెంకటసాయి వికలాంగుల సంక్షేమ సంఘం నాయకులు తెలిపారు. గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మల్కాపురం పరిధి ప్రకాష్‌నగర్ ఏడుగుడుల సమీపంలోని శ్రీ విఘ్నేశ్వర వెంకట సాయి దివ్యాంగుల సంక్షేమ సంఘం వద్ద ఈ క్యాంపు ఉంటుందని పేర్కొన్నారు. క్యాంపుకు వచ్చే వికలాంగులు సదరం సర్టిఫికెట్, ఆధార్, రేషన్‌కార్డుల జెరాక్స్ సెట్లు రెండు, ఫోటోలు రెండింటితో హాజరుకావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9985336148 నెంబరును సంప్రదించాలని సూచించారు.

పౌర సేవల్లో నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి -పాడేరు : పౌర సేవలు అందించడంలో జాప్యం చేయకూడదని జిల్లా కలెక్టరు సుమిత్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయం నుంచి జిల్లాలోని ప్రాజెక్ట్ అధికారులు, సబ్ కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, ఎంపిడిఒలు, ఉపాధిహామీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మ్యుటేషన్ ప్రక్రియ వేగంగా జరగాలన్నారు. ఫ్యామిలీ సర్టిఫికేట్లు నిర్దిష్టమైన గడువులోగా అందించాలని ఆదేశించారు. సచివాలయానికి వచ్చిన ప్రతి సమస్య పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని అదేశించారు. 50 గ్రామాల్లో రీసర్వే పూర్తయిందని, దీనిపై రెవెన్యూ అధికారులకు అవగాహన కల్పించారు. లబ్ధిదారులకు జగనన్న తోడు రుణాలు అందించాలని చెప్పారు.ఎఫ్‌టిఒలు జనరేట్ చేసి గృహనిర్మాణ లబ్ధిదారులకు ముందుగా రూ.ఐదువేల ఆర్థిక సహాయం అందించాలని ఆదేశించారు. మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలని స్పష్టం చేశారు. ప్రతి రోజూ రంపచోడవరం డివిజనల్‌లో 35వేలు, చింతూరులో 20వేలు, పాడేరు డివిజన్‌లో 55వేల మందికి ఉపాధి పనులు కల్పించాలని లక్ష్యాలు నిర్దేశించారు. అన్ని హేబిటేషన్‌లలో ఉపాధి పనులు కల్పించాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాలకు నిత్యవసర సరకులు పంపిణీలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన డీలర్లను సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ జె. శివ శ్రీనివాసు , ఐటిడిఎ పిఒ అర్.గోపాలకృష్ణ, పిఐయు ఇఇ కె.లావణ్య కుమార్, ఏడీ సర్వే వై. మోహనరావు. డిపిఒ కొండలరావు, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, డిఅర్‌డిఎ పీడీ .మురళి, డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ జమీల్ భాషా, ఉపాధి ఏపీడీ గిరిబాబు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

రక్తదానంతో సమాజ శ్రేయస్సు

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు : సమాజ శ్రేయస్సుకు రక్తదానం ఎంతో దోహద పడుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. రక్తదానానికి యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్దిష్టమైన షెడ్యూల్ రూపొందించి జిల్లావ్యాప్తంగా రక్తదాన శిబిరాలు నిర్వహించి, దాతలనుంచి రక్తం సేకరించాలని సూచించారు. డిగ్రీ కళాశాలలలో ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. దీనికి సంబంధించి కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు డిఇఒ లేఖ రాయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. సేకరించిన రక్తాన్ని జిల్లా కేంద్ర ఆసుపత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అవసరాలకు సరఫరా చేయాలని కోరారు. ముందుగా డిఆర్‌ఒ బి. దయానిధి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. డిఆర్‌ఒ సూచనల మేరకు సబ్ ట్రెజరీ అధికారి ఎంవి.ఆర్ ప్రసాద్‌తో సహా పలువురు ఉద్యోగులు శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. 20 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వైస్‌చైర్మన్ ఎస్.గంగరాజు, కార్యదర్శి ఈశ్వరరావు, కోశాధికారి అప్పారావు, కోఆర్డినేటర్ కోటేశ్వరరావు, సభ్యులు సూర్యారావు, సుబ్రహ్మణ్యం, లోహితాస్, గౌరీ శంకర్, మర్ల మణి, వైద్యాధికారిని డాక్టర్ జి.రూపకళ, దనరాజ్, టెక్నికల్ సిబ్బంది, రాజుబాబు, రాజు, అప్పారావు, సతీష్, వెంకట్ పాల్గొన్నారు.

ఫోన్ పోతే ఎక్కడి నుంచైనా ఫిర్యాదు

ప్రజాశక్తి -మధురవాడ : నగర పరిధిలో ఫోన్ పోగొట్టుకుంటే ఫిర్యాదు చేసేందుకు పోలీసుస్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా సైబర్ క్రైమ్ పోలీసులు రిలీఫ్ టెక్ నాలెడ్జ్ సహాయంతో ఒక వెబ్ పోర్టల్‌ను రూపొందించినట్లు పిఎం పాలెం నేరవిభాగపు సిఐ రమేష్ తెలిపారు. ఈ వెబ్ పోర్టల్‌లో నగరంలో ఎక్కడి నుంచైనా ఫిర్యాదు చేయవచ్చన్నారు. నగరంలో ఫోన్ పోగొట్టుకున్నా, ఫోన్ చోరీకి గురైనా పోలీసు వాట్సాప్ నెంబరు 9490617916కు హాయ్ అని మెసేజ్ చేస్తే వెంటనే వాట్సాప్ చాట్ బాక్సు నుంచి ఆటోమెటిక్ రెస్పాన్స్ వస్తోందని తెలిపారు. అందులో ఒక లింక్, క్యూఆర్ కోడ్ ఉంటాయని, లింకుపై క్లిక్ చేసి బాధితుని వివరాలను పొందుపరచాలని పేర్కొన్నారు. పేరు, పోగొట్టుకున్న చరవాణి నెంబరు, ఐఎంఇఐ నెంబరు, ఏరియా పోలీసుస్టేషన్ పేరు, చిరునామా, పోగొట్టుకున్న స్థలం పొందుపరచాలని తెలిపారు. ఈ సమాచారం సిటీ పోలీసు ఫోన్ వాట్సాప్ చాట్ బాక్సు అడ్మిన్‌కు చేరుతుందన్నారు. అక్కడి నుంచి పోలీసులు ఫోన్‌ను ట్రాక్ చేసి సంబంధిత బాధితుడికి సమాచారం ఇస్తారు. ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విమ్స్‌లో మెగా ఆర్థో మెడికల్ క్యాంపునకు స్పందన

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (విమ్స్)లో మెగా ఆర్థో మెడికల్ క్యాంపును డైరెక్టర్ కె రాంబాబు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విమ్స్ ఆస్పత్రిలో అనుభవజ్ఞులైన ఆర్థోపెడిక్ డాక్టర్లచే వైద్య పరీక్షలు జరిపి ఉచితంగా మందులను పంపిణీచేస్తున్నట్లు తెలిపారు. ఈ క్యాంపులో రూ.2000 విలువ చేసే ఎముకల సాంద్రత పరీక్ష, సీరం యూరిక్ యాసిడ్ పరీక్ష ఉచితంగా చేస్తున్నట్లు చెప్పారు. తొలి రోజు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. రోగులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలను కల్పించినట్లు తెలిపారు. బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 వరకు క్యాంపు ఉంటుందని, ప్రజలు సందర్శించి ఆరోగ్య సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

నేరాలు ఘోరాలు

ద్విచక్ర వాహనం చోరీ

ప్రజాశక్తి -జి.మాడుగుల : మండల కేంద్రంలో ఇంటి ముందు పార్కింగ్ చేసిన బైక్ సోమవారం రాత్రి చోరీకి గురైంది. దీనికి సంబంధించి బాధితుడు సింగిడి రాజేష్ అందించిన వివరాలివి. సోమవారం రాత్రి నిలుపుదల చేసిన బైక్ మంగళవారం ఉదయం చూసేసరికి కనిపించలేదన్నారు. దగ్గరలో ఉన్న సిసి కెమెరాల పుటేజీ పరిశీలించగా, సోమవారం రాత్రి ఒంటిగంట సమయంలో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు బైకును దొంగలించినట్లు రికార్డై ఉందన్నారు. ఎపి31 డిపి7577 నంబరు గల రెడ్ కలర్ పల్సర్ బైక్ చోరీకి గురైనట్లు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు...
అన్ని పార్టీలూ ప్రధానికి విజ్ఞప్తి చేయాలి

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం రాష్ట్రంలోని అన్ని పార్టీలూ ప్రధానమంత్రి మోడీకి విజ్ఞప్తి చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ సభ్యులు డి.ఆదినారాయణ, వరసాల శ్రీనివాసరావు కోరారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 635వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్ సిఇసిసిపి విభాగం కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు సమకూర్చుకునేందుకు ఇతర రాష్ట్రాల్లో పార్టీలకతీతంగా పనిచేసే ఒరవడి ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలోని పార్టీలు ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి అన్ని పార్టీలు కలిసి పనిచేయకపోవడం వల్ల ఇప్పటికే భారీ మూల్యం చెల్లించుకున్నామని తెలిపారు. విశాఖ ఉక్కు విషయంలో అలాంటి తప్పు జరగకుండా అన్ని పార్టీలు ప్రధాని దృష్టికి తీసుకెళ్లాలని, తద్వారా ప్రభుత్వ రంగంలో కొనసాగించేందుకు కృషి చేయాలని కోరారు. వామపక్షాలు తప్ప రాష్ట్రంలో ఉన్న అన్ని పార్టీలూ బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు.

రహదారులపై ప్రచారం

మోడీ పర్యటన సందర్భంగా చేపట్టిన నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని కోరుతూ ఉక్కు కార్మికులు వివిధ కార్యక్రమాలు చేపట్టారు. మంగళవారం ఉదయం స్టీల్ ప్లాంట్‌కు వెళ్లే అన్ని రహదారులపైనా ప్లకార్డులు, ఫ్లెక్సీలతో ప్రచారం చేపట్టారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ సమావేశంలో తీర్మానాల మేరకు స్టీల్‌ప్లాంట్ లోపల అన్ని విభాగాల్లోనూ సమావేశాలు ఏర్పాటుచేసి ప్రచారం చేశారు. మోడీ పర్యటన సందర్భంగా జరుగుతున్న ఈ నిరసన కార్యక్రమాలకు వేలాదిమందిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తున్నట్లు ఈ పర్యటనలో మోడీ ప్రకటన చేయాలని ఉక్కు కార్మిక సంఘం నేతలు, పోరాట కమిటీ నాయకులు విజ్ఞప్తి చేశారు. బుధవారం బైక్ ర్యాలీ, 11న కూర్మన్నపాలెం జంక్షన్‌లో నిరసన తెలుపుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు, రామ్మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు బైక్ ర్యాలీ

ఉక్కు ప్రైవేటీకరణ అంశాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్లేందుకు బుధవారం కూర్మన్నపాలెం కూడలి నుంచి నగరంలోని జివిఎంసి గాంధీ విగ్రహం వరకు నిర్వహించే భారీ బైక్ ర్యాలీలో ఉక్కు కార్మిక వర్గం పాల్గొనాలని పోరాట కమిటీ పిలుపు నిచ్చింది. మంగళవారం పోరాట కమిటీ నేతలు రోలింగ్ మిల్స్ విభాగాలలో బైక్ ర్యాలీ ప్రచారాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నేతలు జె.అయోధ్యరామ్, కె.రాజబాబు, డి.దేముడు, కె.పరంధామయ్య, డివిఆర్.రెడ్డి, త్రినాధం, సీతారామరాజు, శ్రీనివాస్ మాట్లాడుతూ బుధవారం ఉదయం 8.30కు ప్రారంభమయ్యే బైక్ ర్యాలీలో కార్మికవర్గం పాల్గొని ప్రధానికి గుణ పాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

అప్పన్న ఆలయ కవాటబంధనం

ప్రజాశక్తి-సింహాచలం: చంద్ర గ్రహణాన్ని పురస్కరించుకొని మంగళవారం ఉదయం అప్పన్న ఆలయంలో ఆలయ ద్వారాలు మూసి కవాటభందనం చేశారు. ఈ సందర్భంగా టోల్‌గేటును మూసివేసి సింహగిరిపైకి ఏ ఒక్కరినీ అనుమతించలేదు.

బీమా సాయం అందజేత

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం, టి.నగరపాలెం గ్రామానికి చెందిన డి.ఈశ్వరమ్మ ఇటీవల మృతి చెందడంతో వైఎస్ఆర్ బీమా కింద ఆమె బంధువు కొండమ్మకు తక్షణ సాయం కింద రూ.10 వేలును సర్పంచ్ పొట్నూరు ఛాయా గౌతమి అందించారు.



కుళాయిని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

తాగునీటి కుళాయి ప్రారంభం

ప్రజాశక్తి-కొయ్యూరు : మండల పరిషత్తు నిధులు రూ.4 లక్షలతో మండలంలోని రాజేంద్రపాలెం పంచాయితీ పరిధి సురేంద్రపాలెంలో ఏర్పాటు చేసిన తాగునీరు ట్యాంక్, కుళాయిలను ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ వారా నూకరాజు మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అంబటి నూకాలమ్మ, వైసిపి మండల అధ్యక్షులు జల్లిబాబులు, సర్పంచుల ఫారం అధ్యక్షులు రేగటి ముసలి నాయుడు, కూడా రాజబాబు, నర్సి కృష్ణ, బోయిన సత్యారావు, బషీర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కూలు పథకాన్ని కొనసాగించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : హైకోర్టు ఇచ్చిన తీర్పును గౌరవించి బెస్ట్ అవైలబుల్ స్కూలు పథకాన్ని కొనసాగించాలని దళిత హక్కుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చింతాడ జోగారావు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకాన్ని వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా ఏర్పాటు చేస్తూ జీవో 19 ఇచ్చారని తెలిపారు. అప్పటినుంచి అమలులో ఉన్న ఈ పథకం కింద సుమారు వెయ్యి మంది దళితులు డాక్టర్లుగా, ఇంజినీర్లుగా ఉన్నత స్థాయికి ఎదిగారని చెప్పారు. రాష్ట్రంలో 62 వేల మంది దళిత విద్యార్థులు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందుతున్నారన్నారు. ఈ పథకాన్ని రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి, చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రులుగా ఉన్నప్పుడు కూడా కొనసాగించారని చెప్పారు. అయితే రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని అతని కుమారుడు జగన్ నిలుపుదల చేయడం దుర్మార్గమన్నారు. జగన్ ప్రభుత్వ చర్యను వ్యతిరేకిస్తూ కోర్టును ఆశ్రయించగా హైకోర్టు ఈ ఏడాది జూలై 29న తీర్పు ఇస్తూ ఈ పథకాన్ని కొనసాగించాలని ఆదేశించిందన్నారు. తీర్పు వెలువడి 3 మాసాలా 15 రోజులు కావస్తున్నా జగన్ ప్రభుత్వం మాత్రం పథకాన్ని కొనసాగించటం లేదని అన్నారు. ఇప్పటికైనా కోర్టు తీర్పును గౌరవించాలని లేకుంటే ప్రభుత్వానికి వ్యతిరేకంగా కోర్టు ధిక్కార కేసు వేస్తామని హెచ్చరించారు. దళిత విద్యార్థులకు ఇవ్వాల్సిన పుస్తకాలు, యూనిఫారం, పాత బకాయిలను తక్షణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దళిత విద్యార్థులకు అన్యాయం చేయవద్దన్నారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

ఆంధ్రుల హక్కును లాక్కుంటారా ?

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఎన్నో పోరాటాలు, అనేక త్యాగాలు, ఆత్మ బలిదానాలతో ప్రభుత్వ రంగంలో ఏర్పడిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయడమంటే ఆంధ్రుల హక్కును లాక్కోవడమేనని ప్రజారోగ్య వేదిక ప్రధాన కార్యదర్శి టి.కామేశ్వరరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలు మంగళవారం నాటికి 586వ రోజుకు చేరాయి. దీక్షలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ 'రైస్ బౌల్ ఆఫ్ ఇండియా' అని ఎంత ఖ్యాతిగాంచిందో, వైజాగ్ స్టీల్ అనేది కూడా భారతదేశంలో అంతటి కీర్తి ప్రతిష్టలను ఆర్జించిందన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కు తీసుకునే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని తెలియజేశారు.

ప్రధాని సభ ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడానికి ఈ నెల 11, 12 తేదీల్లో వస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన ఏర్పాట్లను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ విజయసాయిరెడ్డి, కలెక్టర్ మల్లికార్జున, నగర పోలీస్ కమిషనర్ శ్రీకాంత్ తదితరులు మంగళవారం పరిశీలించారు. ప్రధాని మోడీ పాల్గొననున్న బహిరంగ సభ వేదికను క్షుణ్ణంగా పరిశీలించారు.

నమోదు పూర్తి... ఇక ప్రచారం జాస్తి

గ్రాడ్యుయేట్ ఓటర్లు 2.69 లక్షలు ఆన్‌లైన్ ద్వారా అత్యధికంగా నమోదు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉత్తరాంధ్రలో ఎమ్మెల్సీ ఓటరు అభ్యర్థుల నమోదు కార్యక్రమం సోమవారంతో ముగిసింది. మంగళవారం వెల్లడైన అధికారిక లెక్కల ప్రకారం.. ఉత్తరాంధ్ర వ్యాప్తంగా ఆరు జిల్లాల నుంచి 2,69,535 మంది తమ ఓట్ల నమోదుకు అభ్యర్థనలు పంపారు. వీటిలో శ్రీకాకుళం జిల్లాలో ఆన్‌లైన్ ద్వారా 32,659, భౌతికంగా 16,308 కలుపుకొని మొత్తం 48,967, విజయనగరం జిల్లాలో ఆన్‌లైన్ ద్వారా 26,634, భౌతికంగా 32,647 కలుపుకుని మొత్తం 59,281, విశాఖపట్నం జిల్లాలో ఆన్‌లైన్ ద్వారా 72,765, భౌతికంగా 17,478 మొత్తం 90,243 అభ్యర్థనలు వచ్చాయని, అదేవిధంగా నూతన జిల్లాలైన అనకాపల్లి జిల్లాలో ఆన్‌లైన్ ద్వారా 23,667, భౌతికంగా 18,435 కలుపుకుని మొత్తం 42,102, మన్యం నుంచి ఆన్‌లైన్‌లో 8,393, భౌతికంగా 8,958 మొత్తం 17,351, అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి ఆన్‌లైన్ ద్వారా 9,002, భౌతికంగా 2,589 కలిపి మొత్తం 11,591 అప్లికేషన్లు వచ్చాయని అధికారులు తెలిపారు. దీంతో ఉత్తరాంధ్ర వ్యాప్తంగా ఆన్‌లైన్‌లో 1,73,120, భౌతికంగా 96,418 కలుపుకొని 2,69,535 మంది తమ ఓట్ల నమోదుకు అభ్యర్థనలు పంపినట్లయింది. ఓట్ల నమోదులో భాగంగా చివరి రోజే 85,499 ఓట్లు ఉత్తరాంధ్రలో నమోదుకావడం విశేషం.

ఓటర్ల నమోదు చేయించడం అన్న అంశం ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రధాన ఘట్టంగా చెప్పుకోవచ్చు. ఏ అభ్యర్థి ఎన్ని ఓట్లు నమోదు చేయించుకున్నారన్న, ఎలా ఓటర్లను ప్రభావితం చేశారన్న బట్టి గెలుపు, ఓటముల విశ్లేషణలు ఉంటాయన్నది తెలిసిందే. అయితే ఓటర్ల నమోదు సంగతి సరేసరి.. తర్వాత నిర్వహించే ప్రచారం, వ్యూహ ప్రతివ్యూహాలు సైతం అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తాయన్నది తిరుగులేని వాస్తవం. ఎన్నికలకు ఇంకా చాలా రోజుల వ్యవధి ఉన్న నేపథ్యంలో.. ఒక్క మాటలో చెప్పాలంటే 2023 జనవరిలో వచ్చే సంక్రాంతి పండగ తర్వాతే ప్రతి నిమిషాన్నీ అభ్యర్థులు తమ గెలుపు కోసం వెచ్చిస్తారు. గతంతో పోల్చితే ఈసారి జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు కీలకంగా మారాయి. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రంలోని బిజెపి అమ్మకానికి పెట్టగా రాష్ట్రంలోని వైసిపిలో మాత్రం దీన్ని నిలుపుకోవాలన్న కాంక్ష కనిపించడం లేదు. మరోవైపు వాల్తేరు రైల్వే డివిజన్‌ను కేంద్రం ఎత్తేసింది. విశాఖ కేంద్రంగా కొత్త రైల్వే జోన్, భోగాపురం ఎయిర్‌పోర్టుపైనా నాన్చుడు ధోరణితోనే ఇప్పటివరకూ ఉంది. రాష్ట్ర ప్రభుత్వం మిన్నకుండడం చదువుకున్న వారంతా గ్రహిస్తున్నారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు, వాటి ఫలితాలు నిరుద్యోగ, ఉద్యోగ, సామాన్య ప్రజానీకం భవిష్యత్తు పరిస్థితులను పై సమస్యలతో చూస్తే గనక తీవ్రస్థాయిలో ప్రభావితం చేయనున్నాయి.

ఈ సారి పోటీ రసవత్తరమే...

2023లో జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు అత్యంత రసవత్తరంగా సాగనున్నాయి. ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) ప్రజా సమస్యలపై రాష్ట్రంలోని చట్టసభల్లోనూ, బయటా పోరాడుతూనే ఉంది.

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పిడిఎఫ్ నుంచి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ బరిలో ఉన్న విషయం తెలిసిందే. వైసిపి తరపున బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ సీతంరాజు సుధాకర్, తెలుగుదేశం తరపున గాడు చిన్ని కుమారి లక్ష్మి, బిజెపి తరపున ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్న పివిఎన్.మాధవ్ ఉన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ వ్యతిరేకత అన్ని తరగతుల్లోనూ నెలకొని ఉండడంతో అధికార పార్టీపై పై చేయి సాధించడం కోసం అభ్యర్థులు పోటీపడుతున్నారు.

మోడీ రాకతో.. కొండలు పిండి

జివిఎంసికి కనిపించని 'గ్రీన్ హిల్స్' ధ్వంసం
కొమ్మాది, బోరవానిపాలెంలో కొండలు తవ్వి ఎయుకు గ్రావెల్ తరలింపు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, పిఎంపాలెం

'దారులన్నీ రోమ్ నగరానికే' అన్న చందాన విశాఖ నగరంలో ఏ రోడ్లు చూసినా దేశ ప్రధాని నరేంద్ర మోడీ రాక సందడితోనే నిండిపోతున్నాయి. కేంద్ర పోలీసు బలగాల పహారా, బూట్ల చప్పుళ్లతో విశాఖ నగర వీధులన్నీ ఖాకీల వలయంలో మునిగితేలుతున్నాయి. దేశానికే ప్రధాని అయినందున హడావుడి సహజమే.. కానీ ఈ సందర్భంగా అధికార యంత్రాంగం చేస్తున్న పనులు పలు విమర్శలకు తావిస్తున్నాయి. 12న ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో మోడీ రాక కోసం సభా వేదిక, ఏర్పాట్లు భారీగా సాగుతున్నాయి. మొత్తం గ్రౌండ్‌ను చదును చేసే కార్యాచరణను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. ఎయు అధికార యంత్రాంగం ఈ పనిలో నిమగ్నమైంది. ఈ గ్రౌండ్స్‌లో కూడా మొక్కలు, చెట్లు ధ్వంసం చేసేస్తున్నారంటూ ప్రతిపక్షాలు ఇప్పటికే ఆరోపణలు గుప్పిస్తున్న విషయం తెలిసిందే. నగరంలోనే కాకుండా విశాఖ గ్రామీణ ప్రాంతం ప్రధానంగా ఆరో వార్డు పరిధిలోకి వచ్చే కొమ్మాది పరిసరాలైన బోరవానిపాలెం, ఉప్పాడ తదితర చోట్ల 'గ్రీన్ హిల్స్' (పచ్చని కొండలు) పిండైపోతున్నాయి. భారీ వాహనాలతో గడచిన నాలుగు రోజులుగా కొండలను తవ్వేసి ఈ గ్రావెల్‌ను ప్రధాని మోడీ సభ జరిగే ఎయు గ్రౌండ్స్‌కు రాత్రీ, పగలూ తరలించే ఏర్పాట్లలో యంత్రాంగం నిమగ్నమైంది. గతంలో ఎయు ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్స్ వేదికగా పలు సభలు, కార్యక్రమాలు జరిగినా ఇంతటి పర్యావరణ విధ్వంసం జరగలేదన్న విమర్శలు తాజాగా వినిపిస్తున్నాయి. ఇటీవలే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆటో కార్మికుల సంక్షేమం కోసం భారీ సభను నిర్వహించారు. గతంలోనూ దేశ వ్యాపిత సభలు ఎయు గ్రౌండ్స్‌లో జరిగాయి. కానీ ఇంతలా పర్యావరణ సమస్యలను సృష్టిస్తూ ఏర్పాట్లు జరగలేదన్నది వాస్తవం. దేశ నాయకుడు వచ్చినప్పుడు ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ చోటుచేసుకోకుండా ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై ఉన్నా 'కాస్త వంగమంటే ఏకంగా సాగిలపడినట్టుగా'... వైసిపి ప్రభుత్వం మోడీ ప్రసన్నం కోసం అత్యుత్సాహం చూపుతుందన్న విమర్శలు నానాటికీ అన్ని తరగతుల నుంచీ వినిపిస్తున్నాయి.



నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న గ్రావెల్ తవ్వకాలు



ఎన్నికైన సంఘం నూతన కార్యవర్గం

ఎపి ఎస్‌టిఒ మండల అధ్యక్షునిగా వెంకటరమణ

ప్రజాశక్తి-అడ్డతీగల : ఎపి ఎస్‌టిఒ అడ్డతీగల మండల అధ్యక్షులుగా కె.వెంకటరమణ ఎన్నికయ్యారు. మంగళవారం స్థానిక ఎంఈవో కార్యాలయంలో ఈ ఎన్నికలు జరిగాయి. ఎన్నికల అధికారిగా పెద్దాపురం యూనిట్ అధ్యక్షుడు డీడీ సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా కార్యదర్శి ప్రమోద్ కుమార్, ఎన్నికల పర్యవేక్షణ అధికారిగా పేపకాయల వెంకట కృష్ణ వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో అసోసియేట్ ప్రెసిడెంట్‌గా సతీష్, ఉపాధ్యక్షులుగా బివివి.సత్యనారాయణ, బి.సాయి కుమార్, జె.రవికుమార్, కార్యదర్శి కె.మురళీకృష్ణ, సంయుక్త కార్యదర్శులుగా వై.దొర, జెఎం.చినబాబు, ఎస్.నానాజీ, వి.ధనలక్ష్మీ, ట్రెజరర్‌గా పి.ఆనంద్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గుద్దేటి రామ్మోహనరావు, పాలపర్తి మూర్తిబాబు, మట్టపర్తి వెంకటేశ్వరరావు, నరెళ్ళ చంద్రరావు, కెవిఎంవి.ప్రసాద్, దొర పాల్గొన్నారు.

ఫేక్ లోన్ యాప్‌లతో మోసపోవద్దు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : ఫేక్ లోన్ యాప్ ద్వారా గిరిజనులు మోసపోకూడదని జడ్డంగి ఎస్ఐ షరీఫ్ అన్నారు. మంగళవారం ఎస్ఐ షరీఫ్ సిబ్బంది మండలంలోని పర్వత ప్రాంతమైన కిండంగి గ్రామాన్ని సందర్శించి గ్రామంలో ఉన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్ఐ మాట్లాడుతూ, గిరిజనులు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రమాదకర వ్యాధులు బారిన పడకుండా గిరిజనులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనంతరం గ్రామ గిరిజనులకు దుప్పట్లు, గొడుగులు, జొళ్లు, పిల్లలకు పుస్తకాలు, పెన్నులు, జామంత్రీ బాక్స్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసులు, ఏపిఎస్పి బెటాలియాన్, పోలీస్ సిబ్బంది ప్రసాద్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చిత్రలేఖనం పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : రాష్ట్రస్థాయి చిత్రలేఖనం పోటీలకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. విద్యుత్ పొదుపు అనే అంశంపై ఇటీవల నిర్వహించిన చిత్రలేఖనం పోటీలలో గ్రూప్ ఏ విభాగంలో స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన 5వ తరగతి విద్యార్థి సిహెచ్ మధు కిరణ్ రెడ్డి, 7వ తరగతి విద్యార్థి తోలాటి హారిక ఎంపికైనట్లు హెచ్ఎం శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. విశాఖపట్నం ఎన్‌టిపిసి వారి ఆధ్వర్యంలో నవంబర్ 14న సింహాద్రి సూపర్ టెర్మినల్ పవర్ సంయుక్త పంక్షన్ హాల్ వద్ద రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు డ్రాయింగ్ టీచర్ మిరియాల కొండబాబు తెలిపారు.

టిడిపి బలోపేతానికి కృషి

ప్రజాశక్తి - రంపచోడవరం : టిడిపి బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షులు కారం సురేష్‌బాబు పిలుపునిచ్చారు. మండలంలోని మడిచర్ల పరిధిలో క్లస్టర్ ఇన్‌ఛార్జులు,క యూనిట్ ఇన్‌ఛార్జులు, బూత్ ఇన్‌ఛార్జులతో మంగళవారం ఆయన ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో టిడిపి కార్యకర్తలు వెళ్లి ప్రజల ఇబ్బందులను తెలుసుకోవాలని సూచించారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా గిరిజన ప్రాంతంలో తెలుగుదేశం పార్టీ విజయకేతనం ఎగురవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సింహాచలం, వెలమలకోట సర్పంచ్ వంతల అచ్చియమ్మ, బాపనధర, బాబ్జి, భాస్కర్‌రావు, వెండిలా అబ్బులు, లక్ష్మి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.